క్లుప్తంగా

భోగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామంలో కొలువుదీరిన దుర్గా భోగేశ్వర స్వామివారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్యామ్ సుందర్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం స్వామి వారికి మహా రుద్రాభిషేకం, అష్టవిధ మహామంగళ హారతులు, మంత్రపుష్పం పూజలు చేపట్టారు. అమ్మవారికి కుంకుమార్చన పూజలను జరిపారు. స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ వసంతలక్ష్మి

కోడుమూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనం విద్యార్థులకు వడ్డించాలని ఎంఈఓ వసంతలక్ష్మి సూచించారు. మండలంలోని కల్లపరి ప్రాథమిక పాఠశాల, హైస్కూల్‌ను సోమవారం ఎంఈఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ పాఠశాలల్లో రికార్డులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే విధంగా పాఠాలను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకుని బోధించాలని చెప్పారు.

స్పానిష్ భాషలపై అవగాహన

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో స్పానిష్ భాషపై అవగాహన కల్పించామని, ఇందుకు సంబధించి ఓ సంస్థతో ఎంఓయూ కుదుర్చుకున్నట్లు ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పోటీ ప్రపంచంలో వీదేశీ భాషలు నేర్చుకునేందుకు హైదరాబాద్‌కు చెందిన ఐఎఫ్ఎల్ ఏపీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ అధికారి హార్తిక్ రోహన్, కెరీర్ డెవలప్‌మెంట్ సెల్ డెవిడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

తడకనపల్లెలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

కల్లూరు: మండల పరిధిలోని తడకనపల్లె గ్రామంలో సోమవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కల్లూరు కమిటీ అధ్యక్షుడు పురుషోత్తం ఆధ్వర్యంలో భగవద్గీత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంధాల ప్రా ముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో సభ్యులు ఓబులేసు, ఈశ్వరయ్య, హర్షవర్ధన్, మద్దిలేటి,వరలక్ష్మి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు




ప్రమాదంలో గాయపడిన వెంకటయ్య, సునీల్

పాణ్యం:మండల పరిధిలోని సుగాలిమెట్ట జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు హైవే పెట్రోల్ పోలీసులు తెలిపారు. రుద్రవరం మండలం బిరవోలు గ్రామానికి చెందిన వెంకటయ్య, సునీల్ బేతంచెర్ల రైల్వే స్టేషన్ వద్ద జరిగే స్లాగ్ లోడింగ్ పనుల కోసం బైక్‌పై వెళ్తున్నారు. తిరుపతి నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఓ కారు ముందు వెళ్త న్న బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో వెంకటయ్య, సునీల్‌కు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కేసు నమోదు

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని చెంచు కాలనీలో మహిళపై ఓ వ్యక్తి కత్తితో దాడిచేసిన ఘటన చోటు చేసుకుంది. సోమవారం ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చెంచు కాలనీకి చెందిన రాముడు అదే కాలనీకి చెందిన వెంకటేశ్వరమ్మపై కత్తితో దాడి చేశారన్నారు. వెంకటేశ్వరమ్మ తన భార్యను అసభ్యకరంగా మాట్లాడిందనే నెపంతో రాముడు కత్తితో దాడి చేశారు. వెంకటేశ్వరమ్మ చేతికి గాయం కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి వెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గూడూరు నగర పంచాయతీ కమిషనర్‌గా నాగరాజు

కర్నూలు (టౌన్): గూడూరు నగర పంచాయతీ కమిషనర్‌గా నాగరాజు ప్రభుత్వం నియమించింది. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ శానిటరీ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న ఆయనను గూడూరు కమిషనర్‌గా నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

రైతన్నకేదీ...ప్రభుత్వ భరోసా!

- పెట్టుబడి సాయం ఊసెత్తని కూటమి సర్కార్
- అందని ప్రభుత్వ రాయితీ వ్యవసాయ పరికరాలు
- విత్తనాలు, ఎరువులకు తప్పని పాట్లు
- కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలే దిక్కు



గడివేములలో సాగు చేసిన మిరప

గడివేముల: రైతన్నలకు ఆదుకోవడంలో టీడీపీ కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమై ఇప్పటికే నాలుగు నెలలు కావస్తున్నప్పటికీ రైతులకు పెట్టుబడి సాయంగా ఇస్తామన్న అన్నదాత సుఖీభవ పథకం అందలేదు. కనీసం ఆ ఊసే ఎత్తడం లేదు కూటమి ప్రభుత్వం. అదేవిధంగా రాయితీపై ఇచ్చే వ్యవసాయ పనిముట్లు రైతుల దరిచేరడం లేదు. ఖరీఫ్ సీజన్‌లో కలుపు నివారణ మందు, పంటను ఆశించే పురుగుల మందులు పిచికారీ చేసేందుకు కనీసం స్ప్రేయర్లు కూడా ప్రభుత్వం రాయితీపై ఇవ్వడం లేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో విత్తనాల కోసం, కొన్ని రోజుల క్రితం ఎరువుల కోసం అనేక ఇబ్బందులు పడిన ప్రభుత్వం కనీసం భరోసా కల్పించలేకపోతుంది. దీంతో సాగు కష్టాలు తప్పడం లేదు రైతన్నకు. మండలవ్యాప్తంగా ఖరీఫ్‌లో 18 వేల ఎకరాల్లో సోయాబీన్, పత్తి, మినుము,మిరపంటలు,పొగాకుతో పాటు వివిధ పంటలు సాగు చేశారు. పురుగు మందు పిచికారీ చేసేందుకు రైతులు స్ప్రేయర్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఏడాది వ్యవసాయ శాఖ ద్వారా బీసీ రైతులకు 30 శాతం, ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం రాయితీపై టారాయన్లు, స్ప్రేయర్లు, ఆయిల్ ఇంజిన్‌లు రాష్ట్ర ప్రభుత్వం అందించేది. ఈ ఏడాది ఇప్ప టివరకు రైతులకు ఉపయోగపడే ఎలాంటి వ్యవసాయ పరికరాలు అందలేదు. పంట సాగు సమయంలో రైతులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం పట్టించుకోవటం లేదని వాపోతున్నారు రైతులు.

నాడు ఆరంభంలోనే

గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పకడ్బందీగా రైతు భరోసా పథకం అమలు చేసేది. సీజన్ ప్రారంభంలోనే పెట్టుబడికి అన్నదాతలు ఏమాత్రం ఇబ్బంది పడకుండా రైతుభరోసా మొత్తాన్ని రైతులు బ్యాంక్ ఖాతాల్లో జమచేసేది. పీఎం కిసాన్ కింద రూ.6 వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.7,500 కలిపి ఏడాదికి రూ.13.500 మూడు విడతలుగా నేరుగా అన్నదాతల ఖాతాల్లో జమ చేసేది గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం.

అన్నదాత సుఖీభవ ఏదీ..

సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజలను ఊరించారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయంగా ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని అన్నదాతలను మభ్యపెట్టారు. టీడీపీ కూటమి నాయకులు ఎన్నికల ముందు అన్ని సందర్భాల్లోనూ సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టారు. అన్నివర్గాల ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కిన సీఎం చంద్రబాబు ఏ ఒక్క పథకంపై కనీసం స్పష్టత ఇవ్వడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అప్పులతో ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసినా నేటికీ పెట్టుబడి సాయం ఊసెత్తడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం నిధులు విడుదల చేసినా కూటమి ప్రభుత్వం ఎందుకు చేయడం లేదో అర్థం కావడం లేదని నిట్టూర్చుతున్నారు అన్నదాతలు. వందరోజుల సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కూటమి సర్కార్ ప్రతినిధులు కనీసం పెట్టుబడి సాయం ఎందుకు అందించలేకపోయారో చెప్పాలని నిలదీస్తున్నారు రైతులు.

అధిక ధరలకు కొనుగోలు



రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్ప్రేయర్లు, టార్పాయన్లు, ఆయిల్ ఇంజిన్లు రాయితీపై సరఫరా చేయడం లేదు. దీంతో ప్రైవేట్ వ్యాపారుల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేసుకుంటున్నాం. రైతులకు ప్రతీ ఏడాది పంట కాలంలో ఎంతగానో ఉపయోగపడే స్ప్రేయర్లు అయినా కనీసం 50 శాతం రాయితీపై ప్రభుత్వం సరఫరా చేయాలి. గత ప్రభుత్వంలో ఏ సీజన్‌లో పంట నష్టం జరిగితే ఆ సీజన్‌లోనే పరిహారం ఇచ్చేది. కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తుంది. ఇప్పటికైనా అన్నదాతకు అండగా సంక్షేమ పథకాలు అమలు చేయాలి.

– తలారి చిన్నన్న, రైతు, గడివేముల

రైతులను ఆదుకోవాలి



ఎన్నికల సమయంలో కూటమి నాయకలు రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఆధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ.20 వేల పంటలు సాగు చేసే సమయంలో పెట్టుబడి సాయం అందజేస్తామన్నారు. అధికారంలోకి వచ్చి వంద రోజులైన రైతులకు పెట్టుబడి సాయంపై ఎటువంటి ప్రకటన చేయలేదు. ఖరీఫ్ సీజన్‌లో పంటల పెట్టుబడులకు అప్పులు చేసి వ్యవసాయం చేస్తున్నాం. కొన్ని రోజుల కిందట కురిసిన వర్షానికి మా గ్రామంలో దాదాపు నాలుగు వందల ఎకరాలు మినుము పంట దెబ్బతింది. ఇంత వరకు ఎటువంటి పరిహారం అందించ లేదు.

–ఊశేన్‌బాషా, గడిగరేవుల

అనుమతి రావాల్సి ఉంది



రైతులకు రాయితీపై ఇచ్చే పరికరాల కోసం ప్రభుత్వ నుంచి అనుమతి రావాల్సి ఉంది. ప్రస్తుతం రాయితీతో కూడిన ఎలాంటి పథకాలు ఇవ్వడం లేదు. విత్తనాలు, ఎరువులు రాయితీపై విక్రయించారు. మరికొన్ని రోజుల్లో పెసర, మినుము విత్తనాలు రాయితీపై అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

–హేమసుందర్‌రెడ్డి, ఏఓ, గడివేముల

మౌలిక వసతులు కల్పించండి



ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అనురాధకు వినతిపత్రం ఇస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కర్నూలు (రూరల్) : మండల పరిధిలోని జి.సింగవరం గ్రామంలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ సోమవారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అనురాధకు డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, కార్యదర్శి సురేష్ వినతిపత్రం అందజేశారు. రోడ్లు అధ్వానంగా మారాయని, కనీసం మరమ్మతులు చేయించాలని వారు ఎంపీడీఓను కోరారు. ప్రత్యేకించి బీసీ కాలనీలో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువలు లేనందున మురుగునీరు ఎంపీపీ స్కూల్ ఆవరణలో కుంటను తలపిస్తుందని వాపోయారు.

విద్యార్థులు అధ్యయనం చేయాలి

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం బిల్డింగ్ పర్సనల్ బ్రాండ్ యూజ్ ఏ డెవలపర్ అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఇంట్రో బోట్ ఏఐ టెక్ లీడ్ అధికారి వెంకట శ్రీవాత్స హాజరై మాట్లాడారు. విద్యార్థులు తమ నైపుణ్యాన్ని పుస్తకాల ద్వారా కాకుండా పలు అంశాలపై అధ్యయనాల ద్వారా తెలుసుకోవాలన్నారు. సొంతంగా ఉపాధి అవకాశాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వెబ్ డెలవప్ ఎలా పెపొందించుకోవాలి, సాంకేతిక ఎలా వినియోగించుకోవాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నిక్సాస్ స్వరం వ్యవస్థాపకుడు దీపక్ శ్రీరామ్, ప్లేస్మెంట్ అధికారి సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఒడ్లోనివంక ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



కర్నూలు ఆర్డీఓ శేషిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు (రూరల్) : కల్లూరు మండల పరిధిలోని పెద్దపాడు గ్రామం ఒడ్లోనివంకను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డికి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామకృష్ణ, మధు వినతిపత్రం అందజేశారు. వంకను రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించడం మూలంగా సమీపంలోని దళితవాడ, ఎలిమెంటరీ హాస్టల్ నీటమునిగే అవకాశం ఉందని, దాదాపుగా 130 ఇళ్లలోకి నీరు వచ్చే అవకాశం ఉందని వారు ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. గతంలో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా సర్వేకు ఆదేశించారని, అయితే కల్లూరు తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది స్పందించడం లేదని ఆరోపించారు. మూడు రోజుల్లో వంక ఆక్రమణపై రిపోర్టు తయారు చేయిస్తామని ఆర్డీఓ హామీ ఇచ్చారని రామకృష్ణ, మధు విలేకరులకు తెలిపారు.

‘పొలం పిలుస్తోంది’ పోస్టర్ల విడుదల



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: మండలంలో మంగళవారం నుంచి నిర్వహించనున్న ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను సోమవారం ఏఓ మల్లేష్ కుమార్ తన కార్యాలయ ఆవరణలో నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మొదటి రోజు ఉదయం మండల కేంద్రం సి.బెళగల్లోని గ్రామ సచివాలయం – 2, మధ్యాహ్నం చింతమాను పల్లె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం ఉంటుందన్నారు. రైతులకు ఆధునిక వ్యవసాయం, వ్యవసాయ యాంత్రీకరణ పద్ధతులు, సాగు సమాచారం, సూచనలు తెలియజేయడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ సిద్ధు, ఎంపీటీసీ సభ్యుడు వీరన్నగౌడ్, నాయకులు చిన్న తిమ్మప్ప, ధనుంజయ, హనుమంతు గౌడ్, ఎంఈపీఈఓ వెంకటేష్, వీఏఏ ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇంటి స్థలాల హద్దులు చూపించండి



తహసీల్దార్ ఆంజనేయులుకు వినతి పత్రమిస్తున్న ఇంటి పట్టాలు మంజూరైన లబ్ధిదారులు

కల్లూరు: అధికారులు హౌసింగ్ లేఅవుట్ సర్వే చేయించి ప్లాట్లకు హద్దులు చూపిస్తే లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకుంటారని కేడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి తెలిపారు. సోమవారం లేఅవుట్‌లో ఇంటి పట్టాలు మంజూరైన లబ్ధిదారులు ఎంపీటీసీ కె.నాగేశ్వరరావు, కేడీసీసీ మాజీ డైరెక్టర్, కల్లూరు అర్బన్ 26వ వార్డు కార్పొరేటర్ దండు లక్ష్మీకాంతరెడ్డితో కలసి తహసీల్దార్ ఆంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేవీ రమణారెడ్డి మాట్లాడుతూ బస్తిపాడు గ్రామానికి చెందిన పేదలకు ఈ ఏడాది జనవరి 22న గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఇంటి పట్టాలు మంజూరు చేసిందన్నారు. అయితే భూరక్షణ సర్వేలో రెవెన్యూ అధికారులు ఉన్నందున లబ్ధిదారులకు ప్లాట్ల నంబర్లు, హద్దులు ఇవ్వలేకపోయరన్నారు. ఇప్పటికైనా ఇళ్ల స్థలాలకు సంబంధించి హద్దులు చూపిస్తే హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా ఇళ్లు నిర్మించుకుంటామని లబ్ధిదారులు తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో ఎల్లరాముడు, దస్తగిరి, మత్తేస్, ప్రసాద్, చంద్రన్న,కృష్ణ, మాసుం బాషా తదితరులు పాల్గొన్నారు.

–అలాగే గత ప్రభుత్వంలో గ్రామంలోని పాఠశాల ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయిందని, స్థలం సరిపోవడం లేదని, విద్యార్థులకు తరగతి గదులు, క్రీడా మైదానం లేదని దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తహసీల్దార్‌కు కేడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, ఎంపీటీసీ నాగేశ్వరరావు, గ్రామ ప్రజలు వితని పత్రమిచ్చారు. 465 సర్వే నంబర్ ఐదు ఎకరాలను పాఠశాలకు మంజూరు చేయాలని గ్రామ ప్రజలు కోరారు.

సి.బెళగల్ డీటీల బదిలీ‘ల’లు

- రెండురోజుల్లోనే ముగ్గురు డీటీను మార్చిన వైనం




సి.బెళగల్: రెవెన్యూ అధికారుల బదిలలో భాగంగా చేపట్టిన డిప్యూటీ తహసీల్దార్‌ల (డీటీ) బదిలీలు సి.బెళగల్ మండలానికి సంబంధించి గందరగోళం నెలకొంది. కేవలం రెండు రోజుల్లోనే ముగ్గురిని మార్చిన తీరు రాజకీయ లీలలకు అద్దం పడుతోంది. మండలానికి ఒకరి తర్వాత ఒకరు అన్నట్లుగా డీటీని నియమించిన జిల్లా అధికారులు ఇద్దరిని మారుస్తూ ఆదివారం రాత్రి మరొకరిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వాస్తవానికి మండల డిప్యూటీ తహసీల్దార్‌గా నియమించిన సుధ డిప్యూటేషన్‌పై కర్నూలు కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు. బదిలీల నేపథ్యంలో డీటీ సుధను కలెక్టరేట్‌లోని ఎస్‌డీసీ కేఆర్‌ఆర్‌సీ డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీ చేశారు. డీటీ సుధ స్థానంలో కర్నూలులోని ఎస్‌డీసీ హెచ్ఎన్ఎస్ఎస్ మూడవ యూనిట్‌లో డీటీగా ఉన్న నాగరాజును సి.బెళగల్ మండల రెగ్యులర్ డీటీగా నియామించారు. అయితే ఇక్కడ మతలబ్ జరిగినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. డీటీ నాగరాజును యథాస్థానంలో (కర్నూలు ఎస్‌డీసీ హెచ్ఎన్ఎస్ఎస్ మూడవ యూనిట్‌లో డీటీగా) ఉంచి, కర్నూలు ఎస్‌డీసీ హెచ్ఎన్ఎస్ఎస్ మూడవ యూనిట్‌లో డీటీగా నియామకం అయిన సంజయ్ కుమార్‌ను డిప్యూటేషన్‌పై సి.బెళగల్‌కు నియమించారు. అయితే డీటీ నాగరాజు, సంజయ్ కుమార్ డీటీలుగా బాధ్యతలు స్వీకరించకుండానే మరోసారి డీటీ పేరును మార్చేశారు ఉన్నతాధికారులు. సంజయ్ కుమార్‌ను కలెక్టరేట్ డీటీగా డిప్యూటేషన్‌పై సి.బెళగల్ నుంచి బదిలీ చేసి, మద్దికెర మండల డీటీగా ఉన్న పురుషోత్తంను డిప్యూటేషన్‌పై సి.బెళగల్ మండలానికి బదిలీ చేశారు. కేవలం రెండురోజుల్లో డీటీ నియామకం విషయంలో ఇంత రాద్ధాంతమా అంటూ చర్చించుకుంటున్నారు మండల ప్రజలు.

డిప్యూటీ తహసీల్దార్ బదిలీ

గడివేముల: గడివేముల తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ గురునాథ్ బండి ఆత్మకూరు డీటీగా బదిలీ అయ్యారు. ఇక్కడికి రుద్రవరం తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న రవీంద్ర ప్రసాద్‌ను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ రాజకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా మండలంలోని నలుగురు వీఆర్వోలను ఉన్నతాధికారులు బదిలీ చేశారు. గడివేముల-1లో పనిచేస్తున్న వీఆర్వో సామన్నను చిందుకూరు వీఆర్వోగా, బిలకలగూడూరు వీఆర్వోగా పనిచేస్తున్న వెంకటక్రిష్ణను గడివేముల-1 వీఆర్వోగా, చెనకపల్లె వీఆర్వోగా ఉన్న ఖాజాను మిడుతూరు మండలం దేవనూరు వీఆర్వోగా, చిందుకూరు వీఆర్వోగా పనిచేస్తున్న హరిచంద్రను మిడుతూరు మండల చెరుకుచెర్లకు బదిలీ చేసినట్లు రెవెన్యూ వర్గాలు తెలిపాయి.

మౌలిక వసతులు కల్పించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లు తహసీల్దార్ కార్యాలయంలో మౌలిక వసతులు కల్పించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆర్‌వీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్, సీపీఐ మండల కార్యదర్శి రమేష్, సుగాలి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుండాల్ నాయక్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ కార్యాలయంలో తాగునీరు, టాయిలెట్లు, ఫిర్యాదుదారులు కూర్చునేందుకు కర్చీలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్య క్ష, కార్యదర్శులు సుధాకర్, ఇద్రూబాష, ప్రగతిశీల విద్యార్థి సంఘం జిల్లా కార్యద ర్శి అయ్యన్న, యువజన సంఘం నాయకులు మహబూబ్‌బాష పాల్గొన్నారు.

గడివేములలో చిరుత పిల్లల కలకలం..?

గడివేముల: మండల కేంద్రం గడివేముల గ్రామంలోని పంట పొలాల్లో చిరుత పిల్లలు కలకలం లేపాయి. గ్రామానికి చెందిన రైతులు నంద్యాల – నందికొట్కూరు రస్తాలోని రైస్‌మిల్ సమీపంలోని తమ పంటలను చూసుకునేందుకు సోమవారం సాయంత్రం వెళ్లారు. పొలాల రస్తాలో రెండు చిరుత పిల్లలు ఆడుకుంటుండగా చూసిన అన్నదాతలు భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే పాణ్యం ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన అటవీశాఖాధికారి (డీఆర్‌ఓ) విజయలక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బంది కలాం, జమాల్, మహేష్ గడివేములకు చేరుకుని పంటపొలాల్లో ఆధారాల కోసం రాత్రి వరకు తిరిగారు. వీరితో పాటు గ్రామానికి చెందిన యువకులు సాయిరాం, మోహన్‌రెడ్డి, పరమేష్, చాంద్‌బాషాలతో పాటు మరో 20 మంది చిరుత పులి పిల్లల కోసం ఫారెస్టు అధికారులతో పాటు తిరిగారు. స్థానిక మద్దిలేరు వాగులో చిరుత పులి అడుగు జాడలను గుర్తించారు. పాణ్యం సమీపంలో ఉన్న చిరుత ఈ ప్రాంతంలో తిరుగుతుందని ఓ అంచనా వచ్చారు ఫారెస్టు అధికారులు. కూలీలు మంగళవారం ఉదయం ఎవరూ పనులకు వెళ్లకుండా గ్రామంలో దండోరా వేయించాలని సిబ్బందికి సూచించారు.

వీసీ... ఉంటేనే వినతుల స్వీకరణట!

సి.బెళగల్: వీసీ (వీడియో కాన్ఫరెన్స్) ఉంటేనే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం – పీజీఆర్ఎస్)లో ప్రజల సమస్యల అర్జీలను స్వీకరిస్తామన్న చందనంగా మారింది మండలంలోని అధికారుల పరిస్థితి. పీజీఆర్ఎస్ కార్యక్రమ నిర్వహణపై మండల అధికారుల నిర్లక్ష్యం కొనసాగుతూనే ఉంది. తహసీల్దార్ కార్యాలయం అధికారులు నిర్లక్ష్యం మూలంగా వీసీ లేదంటూ వివిధ శాఖల అధికారులు వెనుదిరగగా సమస్యల పరిష్కారం కోరుతూ వివిధ పల్లెల నుంచి వచ్చిన బాధితులు నిరాశతో ఇళ్లకు వెళ్లారు. మండల కేంద్రం సి.బెళగల్లో ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి తహసీల్దార్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ క్యాక్రమాన్ని తహసీల్దార్ నిర్వహించాల్సి ఉంటుంది. అయితే సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ నిర్వహణకు వీసీ రావడం లేదంటూ తహసీల్దార్ సాకు చూపారు. ఇదే హాల్లో వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. దీంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లేశ్వరి, ఎంఈఓ జ్యోతి, వెలుగు సీసీ రాముడు తహసీల్దార్ కార్యాలయం నుంచి వెనుదిరిగారు. అయితే ఎంపీడీఓ రాముడు, ఈఓఆర్డీ సందీప్, హౌసింగ్ ఏఈ సుమంత్, ఏపీఓ రామన్న మండల పరిషత్ కార్యాలయంలో వీసీ ఏర్పాటు చేసుకుని పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. దీంతో ఎంఈఓ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, వెలుగు సీసీ మండల పరిషత్ కార్యాలయ వీసీకి వచ్చారు. కాగా మండల పరిషత్ కార్యాలయంలో వచ్చే వీసీ తహసీల్దార్ కార్యాలయంలో రాకపోవడం ఎంటని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



కర్నూలు రూరల్ తహసీల్దార్ కార్యాలయ ఎదుట నిలిచిన మురుగునీరు



ఆర్‌డీఓ కార్యాలయం వెళ్లే దారిలో ఒకవైపు మురుగునీరు, మరో వైపు విరిగిపడిన చెట్టుకొమ్మలు

కార్యాలయాలు ఘనం.. రహదారి అధ్వానం

కర్నూలు (రూరల్) : జిల్లా కేంద్రం కర్నూలులో ఒకే ప్రాంతాలో ఆర్డీవో, మహిళా పోలీస్‌స్టేషన్, మహిళల సబ్‌జైలు, కర్నూలు రూరల్ తహసీల్దార్ కార్యాలయలు, ప్రభుత్వ మహిళల నృత్య కళాశాల ఉంది. అక్కడికి వెళ్లాంటే మాత్రం బురద తొక్కాల్సిన దుస్థితి. కార్యాలయాలు ఘనం... రహదారి అధ్వానం అన్నట్లుగా ఉంది పరిస్థితి. ఐదు ప్రభుత్వ సంస్థలు ఉన్నప్పుడు ఎంతోమంది ప్రజలు వారి సమస్యలను అధికారులకు తెలియజేయడానికి ఈ దారిలో వస్తుంటారు. అయితే మురుగునీరు రోడ్డుపై ప్రహిస్తుంటుంది నిత్యం. దుర్వాసన వెదజల్లుతూనే ఉంటుంది. ముక్కులు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి. ఇక వర్షం కురిస్తే మరీ అధ్వానంగా ఉంటుందీ రోడ్డు. ఇప్పటికై నా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆయా కార్యాలయాల ఉద్యోగులతోపాటు ప్రజలు కోరుతున్నారు.